క్లుప్తంగా

కోడిచెన్నయ్యగారిపల్లిలో ఘనంగా కల్యాణం

పెనగలూరు : శ్రీ రామనవమి రోజు నుంచి పెంచలకోన బ్రహ్మోత్సవాల మొదలు వరకు మండలంలో కల్యాణోత్సవాలు నిర్వహించడం అనవాయితీ. ఈ సందర్భంగా మండల కేంద్రం పరిధిలోని కోడిచెన్నయ్యగారిపల్లిలో సోమవారం రాత్రి శ్రీ సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. పురోహితుడు శివయ్య స్వామి ఆధ్వర్యంలో గ్రామస్తులు కల్యాణాన్ని జరిపించారు. అనంతరం అక్కడికి వచ్చిన భక్తులందరికీ అన్న ప్రసాదాన్ని పంచిపెట్టారు. మంగళవారం వేకువజామున పురవీధులలో స్వామి, అమ్మవార్ల విగ్రహాలను ఊరేగిస్తూ వసంతోత్సవం వైభవంగా జరుపుకున్నారు.

భక్తి శ్రద్ధలతో ప్రతిష్ట విగ్రహాల ఊరేగింపు

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామంలో భవాని శంకర్ ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా మంగళవారం విగ్రహాలను ఊరేగించారు. ఈ సందర్భంగా ఉదయం ప్రభాతసేవ, ప్రధాన కలశ షోడశోపచార పూజలు, యంత్రములకు, మూల విరాట్‌లకు పూజలు సాయంత్రం మూల విరాట్‌లను ట్రాక్టర్ ఉంచి భాకరాపేట గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఇందులో మహిళలు కోలాటం భజనలు భక్తులను అలరించాయి.

నీటి కోసం నిరసన

సిద్దవటం : మండలంలో ఓ వైపు భానుడి భగభగలు తట్టుకోలేని విధంగా ఉంటుంటే మరో వైపు ప్రజలకు నీటి కష్టాలు దాపురించాయి. మండలంలోని కమ్మపాలెం గ్రామం ఎస్సీ కాలనీలో సోలార్ తాగునీటి వ్యవస్థ పనిచేయక కొన్నిరోజులుగా తాగునీటి కోసం కాలనీ వాసులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇబ్బందులను అధికారులకు తెలియజేసిన పట్టించుకోకపోవడంతో మంగళవారం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు రోజుల నుంచి నీటి కోసం అల్లాడుతున్నామన్నారు. నీటి కోసం ఎండలో ఆంజనేయ స్వామి ఆలయం వద్దకు వెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. అధికారులు స్పందించి కాలనీలో ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు.

ప్రశంసా పత్రాలు అందజేత

వీరబల్లి : మండలంలోని వీరబల్లి పంచాయతీలోని ఎంకే వడ్డిపల్లిలో ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని ఎం.రెడ్డి హారిక ఇంటర్నేషనల్ మ్యాథమేటిక్స్ ఒలంపియాడ్‌లో ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించింది. మంగళవారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.శివరామరాజు అధ్యక్షతన జరిగిన పాఠశాల వార్షికోత్సవంలో విద్యార్థినిని ఎంఈఓలు రామకృష్ణుడు, కృష్ణయ్యలు అభినందించారు. అలాగే అదే పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు విభ ఇంగ్లిష్ చాంపియన్స్‌లో ప్రతిభ కనబరిచిన పదిమంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలను ఎంఈఓలు చేతులమీదుగా అందజేసి అభినందించారు.

అభినందన

పుల్లంపేట : ఇంటర్ ఫలితాల్లో మండలంలోని ఉడుమువారిపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు సత్తా చాటారు. మంగళవారం ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థులను గ్రామస్తులు అభినందించారు. తమ గ్రామానికి చెందిన విద్యార్థులు పరీక్షల్లో రాణించి జిల్లా మొదటి స్థానం సాధించడం గర్వంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో వీరు మరింతగా రాణించి ఉన్నత స్థానాలు అధిరోహించాలన్నారు. కాగా గ్రామానికి జి.ప్రశాంత్ రెడ్డి 989, మోహిత్ రెడ్డి 984, కె.విష్ణు చరణ్ 984, శ్రీ వర్దన్ రెడ్డి 970 మార్కులు సాధించారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి

సుండుపల్లె : ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని మండల విద్యాశాఖ అధికారి – 2 రవీంద్రనాయక్ తెలిపారు. మండల పరిధిలోని ఊరమాదిగపల్లె, గుండ్లపల్లె, జేసీ కురవపల్లెలలో మంగళవారం ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదును పెంచడానికి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుణాత్మక విద్యను పెంపొందించడానికి ప్రభుత్వ పాఠశాలల్లోని అన్ని సౌకర్యాలను తల్లిదండ్రులతో చర్చించారు. ఏ రకమైన ఫీజులు లేని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పిల్లల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

గ్రామ సచివాలయాలు తనిఖీ

ఒంటిమిట్ట(సిద్దవటం) : మండలంలోని సాలాబాద్, రాచగుడిపల్లి, పెన్నపేరూరు, గంగపేరూరు గ్రామ సచివాలయాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసినట్టు ఎంపీడీఓ కుళ్లాయప్ప తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పలు సమస్యలతో గ్రామ సచివాలయాలకు వచ్చే ప్రజల సమస్యలు ఎలా పరిష్కరించాలో సిబ్బందికి తెలియజేసినట్టు పేర్కొన్నారు.

25న మండల సమావేశం

పుల్లంపేట : ఈనెల 25న (శుక్రవారం) పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఏఓ శ్రీధర్ రెడ్డి తెలిపారు. సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, మండల అధికారులు హాజరు కావాలన్నారు. అలానే అధికారులు తమ శాఖల నివేదికలతో సమావేశానికి రావాలని తెలియజేశారు.

• నిష్క్రమించెన్

భానుడి భగభగలు రోజురోజుకు అధికమవుతున్నాయి. మంగళవారం ఉదయం నుంచి సూర్యదేవుడు ప్రచండమైన ఎండవేడిమిని కురిపించి సాయంత్రం మేఘాల మధ్య అస్తమించే సుందరమైన దృశ్యం ఎంతో సుందరంగా కనిపించింది. ప్రతిరోజూ సాయంత్రం వరకు ఉక్కపోత, వేడి గాలులకు అల్లాడుతున్న ప్రజలకు సాయంత్రం సమయంలో ఉరుములు, మెరుపులతో అక్కడక్కడ జల్లులు కురుస్తుండటంతో పిల్లలు, వృద్ధులు ఎండవేడిమి నుంచి కాస్త ఉపశమనం పొందుతున్నారు.

– ఓబులవారిపల్లె



భానుడు అస్తమిస్తున్న సమయంలో చుట్టూ అలుముకున్న దట్టమైన మేఘాలు

• నీడకు చేరెన్

వేసవి కాలంలో తీవ్రంగా కాస్తున్న ఎండలకు పశువులు విలవిలలాడుతున్నాయి. సిద్దవటం మండలంలోని నేకనాపురం కొమ్మనాయినిపల్లె, బెటాలియన్ ఎదురుగా ఉన్న గ్రామాల పాడి రైతులు పశువులను ఉదయమే మేత కోసం బెటాలియన్ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతానికి తోలి వస్తారు. ఆ పశువులు మేత మేయకుండా ఎండల తీవ్రతను తట్టుకోలేక ఉదయం 10 గంటలకే గ్రామ సమీపాల్లోకి వచ్చి చెట్ల కింద సేద తీర్చుకుంటున్నాయి.

– సిద్దవటం



చెట్టు నీడన సేద తీరుతున్న పాడి పశువులు

బాగుపడేదెప్పుడు.. బాధతీరేదెన్నడు?

అస్తవ్యస్తంగా రాజంపేట రోడ్లు!

- ఇరుకు మార్గాలతో జఠిలమైన ట్రాఫిక్
- రూ.51 కోట్లతో డీపీఆర్ సిద్ధం
- ఆర్అండ్‌బీ శాఖ మంత్రి దృష్టికి వెళ్లిన విస్తరణ అంశం
- నిద్రావస్థలో రాజంపేట ఆర్అండ్‌బీ శాఖ



విస్తరణకు నోచుకోని రాజంపేట ప్రధాన రహదారి

రాజంపేట : పార్లమెంట నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో రోడ్లన్నీ ఇరుకుగా మారిపోయాయి. దీంతో ట్రాఫిక్ సమస్య పెరిగిపోయింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పదేపదే రోడ్లను అభివృద్ధి చేస్తామంటూ ఊకదంపుడు ప్రకటనలు చేస్తున్న తరుణంలో రాజంపేట రోడ్ల విస్తరణను కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదన్న అపవాదులు మూటకట్టుకుంది.

రోడ్ల మంత్రి ఉన్నా..

బీసీ జనార్దన్‌రెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రోడ్లు భవనాల శాఖ మంత్రిగా కొనసాగుతున్నారు. రాజంపేటలో రోడ్ల దుస్థితి ఆర్అండ్‌బీ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దృష్టికి వెళ్లింది. మరీ అయన ఏ విధంగా స్పందిస్తారో వేచిచూడాలి. రాజంపేట రోడ్ల విస్తరణ విషయంలో ఆశాఖ అధికారులు నిద్రావస్థలో ఉన్నారనే విమర్శలు పట్టణవాసులు నుంచి వినిపిస్తున్నాయి.

విస్తరణతోనే ట్రాఫిక్ పరిష్కారం అయ్యేనా..

పట్టణంలో రోడ్లను విస్తరించకుండానే ట్రాఫిక్ సమస్య పరిష్కారం సాధ్యమా అని చర్చనీయాశంగా మారింది. రాజంపేట ప్రధాన రహదారి, ఆర్ఎస్‌రోడ్డు, తిరుపతి రోడ్డు, నెల్లూరు రోడ్డు విస్తరణతో ట్రాఫికర్‌కు చెక్ పెట్టవచ్చునని పట్టణ ప్రముఖుల అభిప్రాయపడుతున్నారు. ఇది కూటమి ప్రభుత్వానికి ఇది ఒక సవాల్‌గా మారనుంది. ఈ రోడ్లలో దుకాణాలు ముందుకురావడంతో పాటు రోడ్డు విస్తరణ లేకపోవడంతో ట్రాఫిక్ జఠిలంగా మారింది.

విస్తరణ జోలికి వెళ్లాలంటనే..

పట్టణంలో పదేళ్లకు పైగా విస్తరణ అంశం అలాగే అటకెక్కింది. పట్టణంలోని మెయిన్ రోడ్డు విస్తరణ జరిగిన నేపథ్యంలో హఠాత్తు ప్రమాదం వల్ల కొంత మంది మృత్యువాతకు గురయ్యారు. అప్పటి నుంచి విస్తరణ జోలికి వెళ్లాలంటనే అధికారులు, పాలకులు జంకుతున్నారు. విస్తరణ సందర్భంగా జరిగిన సంఘటన వల్ల అనేక మంది అధికారులు, పాలకులు ఇబ్బందులు పడ్డారు.

చూపేందుకే పరిమితమైన మార్కింగ్..

రాజంపేట పట్టణంలో పాత బస్టాండు నుంచి మన్నూరు వరకు విస్తరణ జరిపి ముందుకొచ్చిన కట్టడాలకు మార్కింగ్ కూడా ఇచ్చారు. మన్నూరు నుంచి పోస్టాఫీసు వరకు విస్తరణ చేసి సిమెంటు రోడ్డు వేశారు. అక్కడి నుంచి సిమెంటు రోడ్డు వేయడానికి అధికారులు, పాలకులు వెనకాడుతున్నారు. విస్తరణ చేస్తే మిగిలిన రోడ్డు వేయగలిగిన పరిస్థితులు నెలకొన్నాయి.

మలుపుల తొలిగింపు జరిగేనా..

పట్టణంలో ప్రధాన రహదారిలో ఉన్న మలుపు మున్సిపాలిటీ కాంప్లెక్స్ వద్ద ఉంది. ఈ కాంప్లెక్స్‌లో మలుపు తొలిగించాలంటే విస్తరణ సందర్భంగా మార్కింగ్ మేరకు కట్టడాలను తొలిగిస్తే మలుపు ఇబ్బందులు తొలిగిపోతాయనేది చాలకాలం నుంచి వస్తున్న మాట. ఈ మలుపు వద్ద ఎదురెదురుగా బస్సులు, వాహనాలు వస్తే ట్రాఫిక్ అటు పాత బస్టాండు, ఇటు పోస్టాఫీసు(ప్రధాన కార్యాలయం) వరకు నిలిచిపోవాల్సి వస్తోంది. పట్టణంలో బీజీగా వ్యాపారాలు, జనసమూహం అధికంగా ఉండేది ఈ ప్రాంతంలోనే. అంతేగాకుండా బండ్రాళ్ల వీధి, మార్కెట్, జౌళీబజారు. మున్సిపాలిటీ క్లాంపెక్స్ తదితర ప్రాంతంలో మెయిన్ రోడ్డులోని మలుపు ప్రాంతానికి సమీపంలో ఉన్నాయి. మలుపు తొలిగింపు చేపడితే మన్నూరు నుంచి ఉన్నట్లు విశాలంగా ఉంటుందని అధికారులు, పట్టణవాసులు భావిస్తున్నారు. అయితే అది సాధ్యమేనా అన్న ప్రశ్న పట్టణవాసులు తొలిచివేస్తున్న ప్రశ్న.

ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతాం



రాజంపేట పురపాలక సంఘం చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో పాలకవర్గం రాజంపేట పట్టణంలోని ప్రధాన రోడ్ల విస్తరణపై తీర్మానం చేసింది. పట్టణ జనాభా రోజురోజుకు పెరుగుతున్నందున ప్రస్తుతం ఉన్న రోడ్లు ఇరుకుగా ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఆర్అండ్‌బీ శాఖ సమర్పించిన అంచనా పాతబస్టాండు నుంచి ఫ్లైఓవర్ వరకు రూ.31 కోట్లు, పాత బస్టాండు నుంచి పోస్టాఫీసు వరకు రూ.20 కోట్లతో రోడ్డు విస్తరణ చేయాల్సిన అవసరం ఉంది. రెండు దారులను రోడ్డు విస్తరణ చేసేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

– పోలా శ్రీనివాసులరెడ్డి, చైర్మన్, మున్సిపాలిటీ, రాజంపేట

రోడ్ల విస్తరణపై డీపీఆర్ సిద్ధం



రాజంపేటలో ప్రధాన రహదారుల విస్తరణపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో డీపీఆర్ సిద్ధమైంది. ఆర్అండ్‌బీ అధికారులు దాదాపు రూ.60కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశారు. రహదారులు విస్తరణ అంశం మున్సిపాలిటీ కూడా తీర్మానం చేసింది. ఈలోపు సార్వత్రిక ఎన్నికలు వచ్చేశాయి. ఇప్పటి ప్రభుత్వం రోడ్ల విస్తరణ చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

– మర్రి రవికుమార్, వైస్ చైర్మన్, రాజంపేట మున్సిపాలిటీ

కలగానే రోడ్ల విస్తరణ



రాజంపేటలో రోడ్ల విస్తరణ కలగానే ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రహదారులు విస్తరణకు సంబంధించి డీపీఆర్ సిద్ధమైంది. పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ అస్తవ్యవస్తంగా తయారయ్యాయి. రాజంపేటకు వచ్చిన రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఇరుకు రహదారులు స్వయంగా చూసివుంటారు. సకాలంలో స్పందించి రోడ్ల విస్తరణ చేపట్టాలి.

– ఆర్. రమేష్‌నాయుడు, వైఎస్సార్‌సీపీనేత, కూచివారిపల్లె

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఓబులవారిపల్లె : ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ మల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ అని చెప్పారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే చేసుకోవాలన్నారు. 18 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల్లోపు వయస్సు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. ఆదాయ ధృవీకరణ పత్రం, కుల ధృవీకరణ పత్రం తదితర పత్రాలను జతపరచాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ధృవపత్రాలు అందజేత

రామాపురం : విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన ఇంటర్న్‌షిప్ ధృవపత్రాలను మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.పుష్పలత అందజేశారు. మండల పరిధిలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసుకున్న 8 మంది 10వ తరగతి విద్యార్థులలో 2024 – 25 విద్యా సంవత్సరంలో వేసవి సెలవులో ఇంటర్న్‌షిప్ ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చామన్నారు. విద్యార్థులు వృత్తి నైపుణ్యం ఉన్న కోర్సులను ఎంచుకొని చదవడంతో రానున్న రోజులలో ఆర్థిక పురోభివృద్ధి సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో వృత్తి విద్యా ఉపాధ్యాయురాలు హిమబిందు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట ఎస్ఐ బదిలీ

ఒంటిమిట్ట (సిద్దవటం) : ఒంటిమిట్ట ఎస్ఐ బి.శివప్రసాద్ బదిలీ అయ్యారు. ఈయన గత ఏడాది ఆగస్టు 16న ఒంటిమిట్ట స్టేషన్‌లో ఎస్ఐగా బాధ్యతలు తీసుకున్నారు. మంగళవారం జరిగిన బదిలీలలో శివప్రసాద్ బి.మఠం మండలానికి బదిలీ అయ్యారు. కాగా బదిలీల్లో ఒంటిమిట్ట ఎస్ఐగా ప్రభుత్వం ఎవరిని నియమించలేదు.

సీనియార్టీ జాబితాలో తప్పులను సరిచేయండి

గాలివీడు : ఇటీవల విడుదల చేసిన ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలో తప్పులను సరిచేయాలని ఆపస్ జిల్లా అధ్యక్షులు ఎం.నరసింహులు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం మండల శాఖ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. సీనియార్టీ జాబితాలో తప్పులను సరిచేయాలని, ప్రచురించబడిన అన్ని కేటగిరీ/సబ్జెక్ట్‌ల సీనియార్టీ జాబితాల్లో చాలా మంది ఉపాధ్యాయులు వారికి ర్యాంకు, మార్కులు గుర్తులేనందు వలన ప్రతి ఒక్కరి మార్కులు, మెరిట్ ర్యాంకులను జాబితాలో పొందుపరచాలన్నారు. అంతేగాక ప్రతి డీఎస్సీ సెలక్షన్ జాబితాను మన జిల్లా విద్యాశాఖాధికారి వెబ్‌సైట్‌లో ఉంచాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షులు డి.రామేశ్వర్ మాట్లాడుతూ ఎఫ్ఎల్ఎన్ ట్రెనింగ్ డీఆర్‌పీలు, ఎస్ఎస్‌సీ పరీక్షల మూల్యాంకన విధుల్లో పాల్గొన్నటువంటి ఉపాధ్యాయులకు వెంటనే గౌరవ వేతనం చెల్లించవలసిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఏఐటీయూసీ శిక్షణా తరగతులను జయప్రదం చేయండి

రాయచోటి అర్బన్ : మే 10, 11 తేదీలలో జరుగనున్న ఏఐటీయూసీ జిల్లాస్థాయి శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్ కుమార్‌లు కోరారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద శిక్షణా తరగతుల కరపత్రాలను ఆయన సంఘం నేతలతో కలసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు సైద్ధాంతికంగా, రాజకీయంగా చైతన్యవంతులై ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు ఈ శిక్షణా తరగతులు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేత శ్రీనివాసులు, ఏఐటీయూసీ నేతలు బత్తల వెంకటరమణ, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

భూ రీ సర్వే పారదర్శకంగా చేపట్టాలి

రామాపురం : భూ రీ సర్వేలను పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. మండలంలోని గోపగుడిపల్లెలో భూముల రీ సర్వేపై మంగళవారం ప్రజా ప్రతినిధులతో రైతులతో కలసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం భూ రీ సర్వేపై రైతులకు అవగాహన కల్పించారు. రీ సర్వేలో భాగంగా ఎంపిక చేసిన గ్రామాలలో కొత్తగా భూ సర్వే చేసి హద్దులు నిర్ధారించనున్నట్లు తెలిపారు. మారిన ప్రామాణిక కార్యాచరణ విధానం ప్రకారం గ్రామాల్లో భూ వివాదాల పరిష్కారంతో పాటు రికార్డులను సమీకరించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు సరోజమ్మ, ధనలక్ష్మి, నాయకులు చంద్రమౌలి, తిమ్మారెడ్డి, నారాయణ బ్రదర్స్, రెడ్డయ్య, సుబ్బయ్య, కృష్ణయ్య, వెంకటరామరాజు, సర్వేయర్లు మోహన్‌రెడ్డి, బాబ్‌జాన్, వీఆర్‌ఓలు వెంకటసుబ్బయ్య, రాధిక, సిబ్బంది, శివయ్య, ఏపీఓ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల వయోపరిమితి పెంచాలి

రాయచోటి అర్బన్ : డీఎస్సీ అభ్యర్థుల వయోపరిమితిని ప్రభుత్వం 47 సంవత్సరాలకు పెంచాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఏఐవైఎఫ్ నేతలతో కలసి విలేకరులతో మాట్లాడారు. డీఎస్సీ అభ్యర్థుల వయోపరిమితిని 44 నుంచి 47 సంవత్సరాలకు పెంచాలన్నారు. ఈ డీఎస్సీలో ప్రత్యేకంగా, ఆఖరు అవకాశంగా అభ్యర్థుల వయోపరిమితి పెంపు వలన ఎంతోమందికి లబ్ధి చేకూరుతుందన్నారు. అదే విధంగా పరీక్ష గడువు 90 రోజులుగా ప్రకటించాలన్నారు. నిరుద్యోగులకు బాసటగా డీఎస్సీ ప్రకటన కోసం ఏళ్ల తరబడి ఏఐవైఎఫ్ ఎంతో పోరాటం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల బాధను అర్థం చేసుకుని డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయడం హర్షణీమన్నారు. సమావేశంలో నేతలు మురళి, సూరి, నందు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శిశువునకు ముర్రుపాలు శ్రేయస్కరం

లక్కిరెడ్డిపల్లి : శిశువునకు ముర్రుపాలు ఎంతో శ్రేయస్కరమని లక్కిరెడ్డిపల్లి ప్రాజెక్టు సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా మంగళవారం కోనంపేట అంగన్ వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే శిశువుకు ముర్రుపాలు తాపించాలని, ఈ ముర్రుపాలు ఎంతో శ్రేయస్కరమన్నారు. అలానే ప్రభుత్వం అందిస్తున్న పౌష్టిక ఆహారాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం సురక్షితమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ లక్ష్మీదేవి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

రైల్వేకోడూరు అర్బన్ : పౌష్టికాహారంతో క్షయ వ్యాధిని నిర్మూలించవచ్చని మంగళవారం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బ్రహ్మకుమారి తెలిపారు. ప్రధాన మంత్రి నిక్షయ పోషణ్ మిత్రలో భాగంగా లీలావతి ఆస్పత్రి డాక్టర్ దామోదర్‌రెడ్డి సహకారంతో 10 మంది క్షయ రోగులకు 6 నెలలకు సరిపడా పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులు ఈ ఆరు నెలలు మంచి ఆహారం తీసుకొని మందులు వాడితే క్షయను నిర్మూలించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాధవరెడ్డి, సిబ్బంది మురళి, చెన్నారెడ్డి, ఆసియా, జగన్ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని కోనంపేట గ్రామ పరిధిలోని మామిడి తోటలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు మంగళవారం తన సిబ్బందితో కలిసి జూదమాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1700లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలియజేశారు.

ఇంటి నిర్మాణాలను కూల్చిన వారిపై చర్యలు తీసుకోండి

సిద్దవటం : మండలంలోని శాఖరాజుపల్లె రెవెన్యూ గ్రామ పరిధి ఉప్పరపల్లె సర్వేనెంబర్ 424 ప్లాట్ నెంబర్ 47,48లలో నిర్మాణ దశలో ఉన్న తమ ఇంటిని కూల్చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఉప్పరపల్లెకు చెందిన ముస్లిం మహిళలు మంగళవారం ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలతకు వినతి పత్రాన్ని అందజేశారు. బాధితులు మాట్లాడుతూ 2021లో తమకు నివాస స్థలం ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. దానికి సంబంధించిన అనుబంధ పత్రాలు కూడా ఉన్నాయన్నారు. ఆ స్థలంలో నిర్మాణ పనులు జరుగుతున్నాయని, సోమవారం సాయంత్రం ఉప్పరపల్లెకు చెందిన ఓ వ్యక్తి ఆ స్థలం తనదంటూ జేసీబీ యంత్రంతో కట్టడాలను కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల స్పందించి తమకు న్యాయం చేసి, నిర్మాణాలను కూల్చిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దారును కోరారు.

కార్మిక వర్గానికి స్ఫూర్తి లెనిన్

రాయచోటి అర్బన్ : కార్మికులను శ్రమదోపిడీనుంచి విముక్తి కలిగించి పెట్టుబడిదారుల రాజ్యాన్ని కూల్చి ప్రథమ సోషలిస్ట్ రాజ్యనిర్మాత కామ్రేడ్ లెనిన్ కార్మిక వర్గానికి స్ఫూర్తి అని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సీఐటీయూ ఆధ్వర్యంలో లెనిన్ 155వ జయంతిని ఘనంగా నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్య సంఘటన నిర్మాణానికి ఎత్తుగడలే కీలకమని లెనిన్ చెప్పారన్నారు. సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ వ్యవస్థ దోపిడీ తీవ్రతరం అయ్యేకొద్ది నష్టపోతున్న పీడితవర్గ కార్మికులే దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడతారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి.భాగ్యలక్ష్మి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు రాంబాబు, బి.వి.రమణ, అక్బర్, రమేష్, రమణారెడ్డి, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు సిద్దమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సేవలు అద్భుతం

సిద్దవటం : పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవగాహన కల్పించేందుకు పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది తెలిపారు. మండల పరిధి మాచుపల్లె గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషన్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. సిద్దవటం సెక్టారు పరిధిలోని మాచుపల్లె, టక్కోలు గ్రామాల అంగన్‌వాడీ వర్కర్‌లు పలు రకాల పౌష్టికాహార పదార్థాలను తయారు చేసి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ ప్రతినిధి మల్లు విజయ భాస్కర్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీలు అందిస్తున్న సేవలు అద్భుతమన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు అరుణకుమారి, శశికళ, సుబ్బరత్నమ్మ, అంగన్‌వాడీ వర్కర్‌లు వసుందరాదేవి, లక్ష్మిదేవి, మునెమ్మ, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌ఓలను క్రమబద్ధీకరించాలి

రాయచోటి అర్బన్ : 6 సంవత్సరాలు సర్వీసు ఉన్న సీహెచ్‌ఓలను క్రమబద్ధీకరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీహెచ్‌ఓల సంఘం నేతలు సాల్‌మన్‌రాజు, భరత్‌కుమార్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సీహెచ్‌ఓలు మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో నేషనల్ హెల్త్‌మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద సీహెచ్‌ఓలుగా పనిచేస్తున్న తాము గత రెండేళ్లుగా ఎన్నో సమస్యలను ఎదర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌హెచ్‌ఎంలోని ఇతర ఉద్యోగులతో సమానంగా సీహెచ్‌ఓలకు 23 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలన్నారు. ఉద్యోగుల ఆర్థిక, అర్థికేతర సమస్యలను పరిష్కారానికి నిర్దిష్టమైన హామీని ఇవ్వాలంటూ కోరారు. ధర్నా కార్యక్రమంలో ఏపీఎంసీఏ జిల్లా నాయకులు శివకుమార్, అహమ్మద్ బాషాతో పాటు జిల్లావ్యాప్తంగా ఉన్న సీహెచ్‌ఓలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఆర్థిక ప్రోత్సాహకాలకు దరఖాస్తులు చేసుకోండి

చిన్నమండెం : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 20 రకాల పండ్లు, పూల మొక్కల నిర్వహణకు ప్రభుత్వం అందించే ఆర్థిక ప్రోత్సాహకాలకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ శేఖర్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 20 రకాల పండ్లు, పూల మొక్కలు సాగు చేసే ఎస్సీ, ఎస్టీ, చిన్నా, సన్నకారు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు ఎంపీడీఓ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.